# కొంగొత్తగా ఎల్లారెడ్డిపేట బడి


**మన ఊరు- మన బడితో మారిన రూపురేఖలు**

- మంత్రి కేటీఆర్ చొరవ.. ₹8.50 కోట్లతో నిర్మాణం
- అంగన్‌వాడీ నుంచి పదో తరగతి వరకు చదువుకునేలా సముదాయం
- నేడు రామన్న చేతుల మీదుగా ప్రారంభోత్సవం

ఎల్లారెడ్డిపేట, జూన్ 19 : సకల వసతులతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సర్కారు బడి ముస్తాబైంది. ₹8.5 కోట్లతో నిర్మించిన ఈ పాఠశాలల సముదాయాన్ని ఈ నెల 20న మంగళవారం రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. గతంలో ఇదే స్థలంలో ఉన్న నిజాం కాలం నాటి భవనంలో పక్కనున్న మండలాలు, జిల్లాలోని మారుమూల పల్లె వాసులు ఇక్కడికి వచ్చి ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ఉండి విద్యనభ్యసించేవారు. అయితే, అందరూ ముద్దుగా పిలుచుకునే పెద్దబడి పదేళ్ల క్రితం నుంచి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేళ్ల క్రితం కూల్చివేయక తప్పదని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. దీంతో అదే స్థానంలో సకల సౌకర్యాలతో కొత్త బడిని నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు మెగా ఇంజినీరింగ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ₹8.5 కోట్లతో గతేడాది ఏప్రిల్ 23న పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. మెగా ఇంజినీరింగ్ సహకారం, గివ్ తెలంగాణ ఫౌండేషన్ చొరవ, మంత్రి కేటీఆర్ ఆదేశం, కాంట్రాక్టర్ల చురుకుదనంతో కేవల 14 నెలల కాలంలో పెద్దబడి నూతన సొబగులద్దుకున్నది. కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూంలు, మోడల్ డైనింగ్‌హాల్, బాలురు, బాలికలు, ఉపాధ్యాయ సిబ్బందికి వేర్వేరు టాయ్‌లెట్లు, ఆధునిక క్రీడాప్రాంగణం, సకల వసతులతో ఆధునిక పాఠశాలల సముదాయాన్ని పూర్తి చేశారు. కాగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.

### కంప్యూటర్ చాంప్‌కు శ్రీకారం

కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవతో జిల్లాలో కంప్యూటర్ విద్యను అందించేందుకు కంప్యూటర్ చాంప్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుని ఎల్లారెడ్డిపేట ఆధునిక పాఠశాలల సముదాయంలో 50 కంప్యూటర్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు. దీన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించన్నునారు.



మోడల్ డైనింగ్‌హాల్



తరగతి గదిలో క్లాసులు వింటున్న విద్యార్థులు



పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న విద్యార్థులు





# ఎడ్యుకేషన్ హబ్

## విద్యాసంస్థలకు నిలయంగా సిరిసిల్ల

- అమాత్యుడి చొరవతో రాష్ట్రంలోనే విద్యారంగంలో అగ్రగామి
- నాడు డిగ్రీ కళాశాలలకే పరిమితమై.. నేడు పీజీ విద్యకు నెలవుగా
- చేరువైన ఉన్నత విద్య
- అందుబాటులోకి ఇంజినీరింగ్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, వ్యవసాయ, మెడికల్, నర్సింగ్ కాలేజీలు
- రాష్ట్రంలోనే తొలి ఫైన్ ఆర్ట్స్ కళాశాల
- తలమానికంగా కేజీ టూ పీజీ క్యాంపస్
- కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- జిల్లావాసుల హర్షాతిరేకాలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 19 (నమస్తే తెలంగాణ)/ తెలంగాణ చౌక్ : స్వరాష్ట్రంలో సిరిసిల్ల అభివృద్ధిలో దూసుకుపోతున్నది. అన్ని రంగాలతో పాటు విద్యారంగంలోనూ మేటి నగరాలకు దీటుగా రాణిస్తున్నది. నాడు పాత భవనాలు, అరకొర వసతులతో డిగ్రీ వరకు మాత్రమే ఉండేది. జిల్లా ఏర్పడిన తర్వాత మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో నేడు అత్యాధునిక వసతులతో కూడిన నూతన భవనాలు, ఉన్నత విద్యతో పాటుగా సాంకేతిక, వ్యవసాయ, వైద్య, వృత్తివిద్య అందుబాటులోకి వచ్చాయి. జిల్లా ఏర్పడిన తర్వాత సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో 40 ఎకరాల సువిశాల స్థలంలో రూ. 70కోట్లతో అత్యాధునిక మౌలిక వసతులతో ఆచార్య జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీకి అనుబంధంగా వ్యవసాయ కళాశాల అందుబాటులోకి వచ్చింది. పీజీటీఎస్ఎస్సీ ఆధ్వర్యంలో ఎంసెట్ ద్వారా విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. అలాగే వృత్తి విద్యతో పాటుగా జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనుబంధంగా ఇంజినీరింగ్ కళాశాల 2021-22 సంవత్సరంలో అందుబాటులోకి వచ్చింది. నాలుగేళ్ల బీటెక్ కోర్సులను ప్రస్తుతం అగ్రహారం డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. జీవితంలో త్వరగా స్థిరపడడం, స్వయం ఉపాధితో మంచి భవిష్యత్తు నిర్మించుకునేందుకు కృషి చేసే ఐటీఐ కళాశాలను మండెపల్లిలో 2018లో ఏర్పాటు చేశారు. రూ.7.74 కోట్లలతో విద్యార్థులకు కావల్సిన అత్యాధునిక ట్రేడ్ ల్యాబ్ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఏడు కోర్సులు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి కూడా విద్యార్థులు అడ్మిషన్లు తీసుకొని కోర్సులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు వివిధ వెల్ఫేర్స్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలు నాణ్యమైన విద్యనందిస్తుండగా, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేటలో బాలుర డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లిలో 2017లో తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఫర్ విమెన్ కళాశాల వేములవాడలో 2016 ఏర్పాటు చేశారు.

### అందుబాటులో వైద్యవిద్యా కళాశాలలు

బాలికలు వైద్య వృత్తిల్లో రాణించి ఉన్నతమై అవకాశాలు అందిపుచ్చుకునేలా జిల్లా కేంద్రంలో కార్మిక క్షేత్రం సిరిసిల్ల పట్టణంలో 2017లో రూ. 36.40 కోట్లతో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యసంవత్సరానికి 100 సీట్ల చొప్పున 400 మంది విద్యార్థులు ఈ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేస్తున్నారు. సకల హంగులతో కూడిన భవనంతో పాటుగా ఆత్యధునిమైన ల్యాబ్ సౌకర్యంతో, ప్రాక్టికల్‌లో భాగంగా విద్యార్థులు జిల్లా ప్రధాన దవాఖానతో పాటు వేములవాడ, సిద్ధిపేట వంటి దవాఖానలకు వెళ్లి పేదలకు నర్సింగ్ సేవలను అందిస్తూ వృత్తిపరమైన విద్యలో రాణిస్తున్నారు. పట్టణ శివారులోని పెద్దూర్‌లో ₹165 కోట్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైద్యవృత్తిపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు దూరప్రాంతాలకు వెళ్లకుండా జిల్లా కేంద్రంలో విద్య అందడంతో పాటు జిల్లాలోని నిరుపేద ప్రజానీకానికి మెరుగైన వైద్యసేవలు అందుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### యువతుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు

జనరల్ డిగ్రీ తరహాలోనే మూడేళ్లపాటు వృత్తి విద్యా విధానంలో ఫ్యాషన్ డిజైనింగ్, ఫొటో డిజిటల్ ఇమేజింగ్, ఇంటీరియర్ డిజైనింగ్ కోర్సులతో అమ్మాయిల సూపర్ కెరీర్‌కు ఎక్సలెంట్ చాయిస్‌గా నిలుస్తున్నది ఫైన్ ఆర్ట్స్ కళాశాల. జేఎన్టీయూకు అనుబంధంగా రాష్ట్రంలోనే తొలి ఫైన్ ఆర్ట్స్ కళాశాల తంగళ్లపల్లి మండల కేంద్రంలో 2021-22 విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చింది. ప్రతి కోర్సులో 40మంది చొప్పున మూడు కోర్సులలో మొత్తం 120సీట్ల కేటాయించారు. ఈ కోర్సులు చేసిన విద్యార్థులు స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అనతికాలంలోనే రాణించి తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటాలు వేసుకోవచ్చు. సిరిసిల్లలో బీసీ, ఎస్సీ ఉద్యోగార్థుల కోసం స్టడీ సర్కిళ్లు ఏర్పాటయ్యాయి.

'మన ఊరు-మన బడి'లో భాగంగా నియోజకవర్గంలో 75 స్కూళ్లను ఆధునీకరంగా మారాయి.



### నేడు విద్యా దినోత్సవం

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యాదినోత్సవం నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో పతాకాన్ని ఆవిష్కరిస్తారు. తదనంతరం నిర్వహించే సభలో విద్యారంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరిస్తారు. 'మన ఊరు-మన బడి' పాఠశాలలను ప్రారంభిస్తారు. 10 వేల గ్రంథాలయాలను, 1600 డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభిస్తారు. పిల్లలకు పోటీలు నిర్వహిస్తారు.

### రాష్ట్రానికే రోల్ మోడల్‌గా గీతానగర్ స్కూల్

జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిపారు. రూ. 3.50కోట్లతో ఆధునిక వసతులతో, ఒకేసారి 1000మంది కుర్చుండి తినే పెద్దడానింగ్ హాల్, డిజిటల్ గ్రంథాలయం లాంటి మౌళిక వసతులతో 2021-22 విద్యా సంవత్సరం అందుబాటులోకి వచ్చింది. కాగా చక్కని వసతులు, ఆంగ్ల భాషలో విద్యబోధనతో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. జూన్ 12 నుంచి ఈ విద్యా సంవత్సరం మొదలు కాగా, అప్పుడే అడ్మిషన్లు పోటాపోటీ కనిపిస్తున్నది. కొత్తగా 250 మందికి పైగా విద్యార్థులు చేరికతో పాఠశాలలో మొత్తం సంఖ్య వెయ్యికి చేరనున్నది. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల్లో ప్రైవేట్ పాఠశాలల నుంచి 110 అడ్మిషన్లు రావడంపై పాఠశాల హెచ్ఎం నాగుల భాగ్యరేఖ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని ఏటా పదో తరగతిలో విద్యార్థులు అత్యుత్తుమ ఫలితాలు సాధిస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల




### ఏర్పాట్ల పరిశీలన

జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్‌నగర్‌లో గల మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీని మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనుండగా, దీనికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరిశీలించారు. ఆయన వెంట టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఉన్నారు.



మినీ స్టేడియం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నాయకులు

### నూతన కేజీబీవీలు, గురుకులాలు

జిల్లాలో 2017 సంవత్సరంలో నాలుగు కస్తూర్బా విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. వీర్నపల్లి, సిరిసిల్ల, వేములవాడ అర్బన్, రుద్రంగి మండలాల్లో ఒక్కో భవనం సుమారు 5 ఎకరాల సువిశాల భవనంలో రూ.3 కోట్లతో అత్యాధునిక మెరుగైన మౌలిక వసతులతో అందుబాటులోకి వచ్చాయి. అందులో వీర్నపల్లి, సిరిసిల్ల కేజీబీవీలు అప్‌గ్రేడ్ అయి ఇంటర్ విద్యను కూడా అందిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి కేటగిరీలో గురుకుల విద్యాసంస్థలు బాలబాలికలకు అందుబాటులోకి వచ్చాయి. బీసీ గురుకుల పాఠశాలలో నూతనంగా 2017 సంవత్సరంలో బాలురు, బాలికలకు ఒక్కోటి చొప్పున అందుబాటులోకి రాగా, 2019లో మళ్లీ రెండు బాలబాలికల గురుకుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయి. సోషల్ వెల్ఫేర్ విభాగంలో రెండు కళాశాలలు, అలాగే ప్రతి కేటగిరీలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగంలో పాఠశాలలు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయి.

### విజ్ఞాన నిలయంగా లైబ్రరీ

ప్రశాంతమైన వాతావరణంలో పైసా ఖర్చులేకుండా పోటీ పరీక్షలతోపాటు ఇతర పుస్తకాలు, మ్యాగజైన్స్, దిన పత్రికలు ఉచితంగా 24గంటలు అందుబాటులో ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి ప్రతి రోజు సుమారు 700కు పైగా ఉద్యోగార్థులు వచ్చి ప్రిపేరవుతున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం రూ.3.60 కోట్లతో అత్యాధునిక వసతులతో రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా నిలిచింది. ఉద్యోగార్థులకు కావాల్సిన ప్రతి పుస్తకం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి అందుబాటులో ఉంచుతూ నిరుద్యోగుల పాలిట కల్పతరువుగా మరింది.



గంభీరావుపేట కేజీ టూ పీజీ పాఠశాల

# పలకతో వచ్చి.. పట్టాతో ఇంటికి

## రాష్ట్రంలోనే తొలి కేజీ టూ పీజీ కళాశాల

'మన ఊరు-మనబడి'లో భాగంగా రాష్ట్రంలోనే తొలి కేజీ టూ పీజీ క్యాంపస్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్మించారు. పలుకతో వచ్చిన విద్యార్థి పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తయ్యే వరకు ఒకే చోట చదువుకునేలా రాష్ట్రంలోనే ఆదర్శంగా ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్ చొరవ మేరకు రహేజా కార్ప్ ఫౌండేషన్, మైండ్ స్పేస్ రిట్, యశోద హాస్పిటల్, ఎమ్మార్ఎఫ్, డివీస్ ల్యాబ్, గివ్ తెలంగాణ, గ్రీన్‌కో సహకారంతో ఆరెకరాల్లో ₹3కోట్ల వ్యయంతో విద్యా సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. మొత్తం 70 తరగతి గదుల్లో 3500 మంది తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో అభ్యసించేందుకు ఆధునిక హంగులతో ఎడ్యుకేషన్ హబ్‌లా నిర్మాణాలు పూర్తి చేశారు. 250 మంది చిన్నారులకు సరిపడేలా అంగన్‌వాడీ కేంద్రం.. చిన్నారులకు ప్రీ ప్రైమరీ, క్రీడా మైదానంతో పాటు ప్రైమరీ, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటు పీజీ కళాశాలలకు అనుగుణంగా భవన సముదాయాలు సిద్ధం చేశారు. ప్రాంగణంలో డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రం, వెయ్యి మంది ఒకే సారి కూర్చొని తినే విధంగా డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గత డిసెంబర్‌లో ₹6.80 లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యమున్న ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. అన్ని వసతులతో వంట గదితో పాటు సామగ్రిని నిల్వ చేసేందుకు ప్రత్యేక గదులను నిర్మించారు. 50 కంప్యూటర్లతో నైపుణ్యాభివృద్ధి శిక్షణకేంద్రం సిద్ధం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 40వేల చదరపు అడుగుల్లో క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. అందులోనే క్రికెట్, వాలీబాల్, పుట్ బాల్, బాస్కెట్ బాల్ కోర్టులతో పాటు అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన ఎఫ్ఐఎఫ్ఏ స్టాండర్డ్ ఆస్ట్రో టర్ఫ్ ప్లే మైదానంగా తీర్చిదిద్దారు. ఈ విద్యాలయాన్ని గత ఫిబ్రవరి ఒకటిన మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభం కాగా, మొదటి రోజే 40 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. అందులో చాలా వరకు ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి(ఫైల్)

# దివ్యాంగులకు అడిగినవన్నీ..

- వెయ్యి మందికి ఉపకరణాలు
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్, జూన్ 19 : దివ్యాంగులందరికీ అడిగినవన్నీ అందించడానికి సిరిసిల్లలో వేదిక ముస్తాబైంది. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జిల్లాలోని దాదాపు వెయ్యి మందికి మంగళవారం స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించనున్నారు. కాగా, ఇప్పటికే జిల్లాలో సహాయ ఉపకరణాలు అవసరమయ్యే వారిని మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో జిల్లా సంక్షేమ శాఖ అధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా క్యాంపులను ఏర్పాటు చేసి, దాదాపు రెండు వేల మందిని గుర్తించారు. వారికి దాదాపు రూ.2.50 కోట్ల విలువైన పరికరాలను మంజూరు చేశారు. ఇందులో దాదాపు వెయ్యి మందికి ఇప్పటికే వివిధ కార్యక్రమాల్లో ట్రైసైకిళ్లు, ఎలక్ట్రిక్ చార్జింగ్‌తో నడిచే మోటర్ సైకిళ్లు, వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు, శ్రవణ యంత్రాలు, అందించారు. వీటితో పాటు దివ్యాంగుల విద్యార్హతను బట్టి రుణాలు సైతం మంజూరు చేశారు. కాగా, మిగితా వెయ్యి మంది దివ్యాంగులకు మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో సహాయ ఉపకరణాలను అందించనున్నారు. ఇందులో 204 మందికి హియరింగ్ ఎయిడ్, 168 మందికి క్రట్చెస్, 126 మందికి మాన్యువల్ ట్రై సైకిళ్లు, 68 మందికి వీల్ చైర్‌లు, 157 మందికి మెటారైజ్డ్ ట్రై సైకిళ్లు, 112 మందికి వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ ఫోన్స్, 62 మందికి ల్యాప్‌టాప్‌లు, 101 మందికి ఇతర పరికరాలు ఇవ్వనున్నారు.

### ఎంపిక పూర్తి చేశాం



జిల్లాలో సహాయ ఉపకరణాల అవసరమున్న దివ్యాంగుల ఎంపిక కోసం మంత్రి కేటీఆర్ ఆదేశాలతో గతేడాది జనవరి నుంచి ప్రత్యేక శిబిరాలను నిర్వహించాం. ఈ క్యాంపుల ద్వారా రెండు వేల మందిని గుర్తించాం. వీరికి అవసరమైన సహాయ ఉపకరణాల కోసం రూ.2.50 కోట్లు మంజూరు చేశారు. వివిధ కార్యక్రమాల్లో ఇప్పటికే వెయ్యి మందికి పంపిణీ చేశాం. మంగళవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మిగతా వారికి అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. - లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి, రాజన్న సిరిసిల్ల